క్లుప్తంగా

బొడ్డేటి ఆయకట్టుకు సాగునీరు విడుదల



సాగునీరు విడుదలకు వెళ్తున్న కె.జె.పురం రైతులు

మాడుగుల రూరల్: కోనాం జలాశయం నుంచి బొడ్డేటి ఆయకట్టుకు సాగునీరు విడుదలైంది. కె.జె.పురం నీటి సంఘం ఆధ్వర్యంలో గురువారం కె.జె.పురం రైతులు పూజలు నిర్వహించి సాగునీరు విడుదల చేశారు. శిరిజాం చానల్ నుంచి బొడ్డేటి ఉప కాలువ ద్వారా ఖరీఫ్ అవసరాల కోసం సాగునీరు అందనుంది. నీటి సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి అచ్చింనాయుడు, మాజీ అధ్యక్షుడు ఎం.వి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, నాయకులు రాపేట జోగినాయుడు, శరగడం ఆదిబాబు, కర్రి అప్పలనాయుడు, పెంటకోట పెదకన్న, వేగి జగ్గారావు పాల్గొన్నారు.

80 మందికి వైద్య సేవలు

మాడుగుల రూరల్: కె.జె.పురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మాడుగులలో వైద్య సేవలందించారు. వైద్యాధికారి ప్రసాదపాత్రుడు 80 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి, నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో అంగన్‌వాడీ కేంద్రాలు -3, 5లను ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. ఇక్కడ ఎనిమిది కేంద్రాలకు సంబంధించి మూడింటికి పక్కా భవనాలు ఉన్నాయి. మరో మూడు కేంద్రాలకు స్థల సేకరణ నిమిత్తం పరిశీలన చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలో పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక హైస్కూలును సందర్శించారు. ఇక్కడ గతేడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఎంపీపీ పాఠశాల నుంచి 3, 4, 5 తరగతులను హైస్కూలులో విలీనం చేయడం ఈ సమస్య వచ్చిందన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది ఇచ్చే సలహాలు పాటించాలని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. గురువారం అమ్మపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్య సూత్రాలు గురించి వివరించారు. దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్ చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సి.హెచ్.ఓ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి చౌడువాడ విద్యార్థిని ఎంపిక



లోష్ణవి

కె.కోటపాడు: చౌడువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పాచిల లోష్ణవి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికై ంది. ఇక్కడ చదువుకుని ఇటీవల పదో తరగతి ఫలితాల్లో 570 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. గ్రామానికి చెందిన సదరు విద్యార్థిని హెచ్‌ఎం బి.సన్నిబాబు, ఉపాధ్యాయులు ఎ.సత్యంనాయుడు, కె.వై.పి.లక్ష్మి, చాంద్‌బీబీ, త్రినాథ్‌రావు గురువారం అభినందించారు.

తల్లడిల్లి!

అసలే పేద బతుకులు... తమ పిల్లలను ప్రయోజకులను చేయాలని తపించి.. కాయకష్టం చేసుకుని చదివిస్తున్న తల్లుల ఆశలపై ఆదిలోనే చంద్రబాబు సర్కారు నీళ్లు పోసింది. ఇంట్లో ఎంతమంది పిల్లలను చదివిస్తున్నా, వారందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల హామీగా ఊదరగొట్టి, ఇప్పుడు ఏరు దాటాక బోడు మల్లన్న అన్నట్టుగా మోసానికి దిగింది. విద్యార్థి తల్లికి రూ.15 వేలు ఇస్తామని జీవో జారీ చేయడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తమ పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.



- ఇంట్లో ఒక్కరికే తల్లికి వందనం ?
- కూటమి ప్రభుత్వ జీవోపై విస్మయం
- అయోమయానికి గురవుతున్న తల్లులు

హామీ అమలు చేయాలి



మా పెద్దమ్మాయి లోహిత కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి, చిన్నమ్మాయి జాస్మిత నర్సీపట్నంలోని ప్రైవేటు స్కూలులో 5వ తరగతి చదువుతున్నారు. వీరి చదువుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి నగదు ఉపయోగపడేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన హామీ మేరకు మా ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింప జేయాలి.

– రొంగల వరలక్ష్మి, జె.పి.అగ్రహారం, రోలుగుంట మండలం

మాట మార్చారు



ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే ఒక్కరికే డబ్బులు ఇస్తామని చెప్పడం భావ్యం కాదు. అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి. విద్యార్థి తల్లిదండ్రులు ఆశలను వమ్ము చేయకుండా హామీ నిలబెట్టుకోవాలి. లేదంటే మా పిల్లల చదువుపై ఆర్థిక భారం పడుతుంది.

పోలుపర్తి రాధ, నాతవరం గ్రామం, మండలం

ఇద్దరికీ నగదు ఇవ్వాలి



నా భర్త వాసు కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. మాకు ఇద్దరు పిల్లలు. వారిలో పాప వర్షిణి 6వ తరగతి, బాబు భార్గవ్ ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో తల్లికి వందనం పథకంలో మా పిల్లలిద్దరికీ రూ.15 వేల చొప్పున అందుతుందని ఎదురు చూస్తున్నాం. ఇద్దరికీ రూ.30 వేలు ఇవ్వాలి.

కొమ్మోజు దేవి, మాకవరపాలెం

పిల్లలను చదివించడం ఎలా?



నా ఇద్దరు పిల్లలు మా గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద నేరుగా నా బ్యాంకు ఖాతాలో డబ్బులు వేసేవారు. కూటమి అధికారంలోకి వస్తే ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున మా ఇద్దరి పిల్లలకు కలిపి ఏడాదికి రూ.30 వేలు వస్తాయని ఆశిస్తున్నాం. ప్రభుత్వం కొత్తగా విధించిన నిబంధనల ప్రకారం ఒక్కరికే డబ్బులు వస్తాయని టీవీలో చెబుతుంటే విన్నాను. ఇలాగైతే ఎలా? మా పిల్లలను చదివించడం కష్టం.

– మైనం లక్ష్మి, చమ్మచింత గ్రామం, నాతవరం మండలం

మోసం చేయొద్దు



సీఎం చంద్రబాబునాయుడు మరోసారి మోసం చేస్తున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం కింద ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని ఇటీవల ఎన్నికల్లో చెప్పారు. ఇప్పుడు గెలిచిన తర్వాత కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఇస్తామని చెప్పడం మోసం చేయడమే. మా బాబు మోహన రంగ ఆరో తరగతి రావికమతం ప్రైవేటు స్కూలులో, పాప లావణ్య మా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. మా ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం కింద ఏడాదికి రూ.30 వేలు అందించాలి.

– మోటారి ధనలక్ష్మి, బుదిరెడ్లపాలెం, బుచ్చెయ్యపేట మండలం

చదువుపై భారం



మా పెద్ద పాప భార్గవి 6వ తరగతి పాతవలస హైస్కూల్‌లోనూ, చిన్నపాప యమున మా గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పినట్టుగా తల్లికి వందనం పథకం కింద ఇద్దరికీ రూ.15 వేల చొప్పున వస్తాయని ఆశపడ్డాం. ఇప్పుడు ఒక్కరికే అని జీవో ఇవ్వడంతో పిల్లల చదువులపై భారం పడుతోంది. గత ప్రభుత్వంలో అమ్మఒడి కింద జూన్‌లో నగదు నా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేది. ప్రస్తుతం తల్లికి వందనం నగదు ఎప్పుడు అందిస్తారో ప్రకటన చేయలేదు.

– రంధి పుష్ప, సూదివలస గ్రామం, కె.కోటపాడు మండలం

ఒక్కరికే ఇస్తే ఎలా?



ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం అందజేస్తామన్న చంద్రబాబు నేడు ఒక్కరికే ఇస్తామనడం బాధాకరం. మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో ఒక్కరికే తల్లికి వందనం నగదు ఇస్తే ఎలా చదివించాలి. ఇచ్చిన మాట ప్రకారం మా పిల్లల ముగ్గురికి తల్లికి వందనం అందజేయాలి.

– సలాది వెంకటసత్యవతి, గాదిరాయి, మాడుగుల మండలం

పూర్తి స్థాయిలో హామీ నెరవేర్చాలి



ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం వర్తింప చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. మాకు ఇద్దరు కుమార్తెలు, నర్సీపట్నం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. తరగతులు ప్రారంభమైన నెల రోజులైంది. ఇప్పటి వరకు తల్లికి వందనం నగదు మంజూరు కాలేదు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ విద్యా వ్యవస్థ గురించి ఎంతో ఆలోచించి పథకాలు నూరుశాతం అమలు చేశారు.

– మాకిరెడ్డి విజయలక్ష్మి, పప్పుశెట్టిపాలెం, గొలుగొండ మండలం

మాట మార్చవద్దు



నాకు ఇద్దరి పిల్లలు.. పెద్దమ్మాయి తనుశ్రీ(2వ తరగతి), విద్యశ్రీ (1వ తరగతి) నర్సీపట్నంలోని ప్రైవేటు స్కూల్లో చదువుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఇంట్లో ఎంతమంది చదువుకున్నా, అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. హామీ అమలుపరచాలి.

– అనిమిరెడ్డి సీతారత్నం, జానకిరాంపురం, రోలుగుంట మండలం

గ్రామాల పరిశుభ్రతతో రోగాల నియంత్రణ



రోడ్డుపై చెత్తను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు, సిబ్బంది



మండల కేంద్రంలో శుభ్రం చేస్తున్న పొక్లెయిన్

నాతవరం: సీజనల్ వ్యాధులను నివారించేందుకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. నాతవరం పంచాయతీలోని వీధుల్లో చెత్తా చెదారాలను ఆయన గురువారం పరిశీలించారు. వాటిని యుద్ధప్రాతిపదికన తరలించే చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను ఆధ్వర్యంలో వీధుల్లో చెత్త తరలింపుతోపాటు డ్రైనేజీలు శుభ్రం చేయించారు. పలు గ్రామాల్లో రోడ్ల పైనే చెత్త ఉండటంతో స్థానికులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో పర్యటించి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాలు పరిశుభ్రంగా లేకపోతే డయేరియాతోపాటు ఇతర రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశామన్నారు. తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని ఆదేశించామన్నారు. ఆయా గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేసి సిబ్బందిపై చర్యలు చేపడతానన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ఎన్.వి.ఎస్.మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ చేయాలని ఆదేశం

నాతవరం: విద్యార్థులకు వచ్చిన పుస్తకాలు, ఇతర సామగ్రిని వెంటనే పాఠశాలలకు తరలించి పంపిణీ చేస్తున్నామని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. మండల కేంద్రానికి గురువారం వచ్చిన కిట్లను ఆయన పరిశీలించి మండల వ్యాప్తంగా పాఠశాలలకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా వెంటనే విద్యార్థులకు అందించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. 95 శాతం పుస్తకాలు, బ్యాగ్‌లు, ఇతర సామగ్రి మండలానికి వచ్చాయన్నారు. ఇంకా రావలసిన విద్యా సామగ్రి విషయాన్ని బుధవారం మండల పర్యటకు విచ్చేసిన డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో అప్పారావుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.



విద్యార్థులకు వచ్చిన కిట్లు పరిశీలిస్తున్న ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు

కరకలో రోడ్డు ఆక్రమణ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చెయ్యపేట: కరక గ్రామంలో రోడ్డు ఆక్రమణను మండల అధికారులు తొలగించారు. టీడీపీ నాయకుడు రోడ్డు ఆక్రమణపై గురువారం సాక్షి కథనానికి ఎంపీడీవో వెంకటాచార్య స్పందించారు. ఆయన ఆదేశాలతో మండల జేఈ ప్రభు, పంచాయతీ సెక్రటరీ సురేష్, వీఆర్వో రమణ, సచివాలయ సిబ్బంది జ్యోతి తదితరులు ఇక్కడ టీడీపీ నాయకుడు సిమెంట్ రోడ్డుకు అడ్డంగా వేసిన కర్రలను, సిమెంట్ దిమ్మను తొలగించారు. గ్రామస్తులు నడిచే రహదారిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని, గొడవలు పడకుండా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

నృసింహావతారంలో జగన్నాథస్వామి

చోడవరం: జగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా నృసింహావతారంలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. పట్టణంలోని బోళ్లవీధి రామాలయంలో స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ఐదో రోజు స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి నృసింహావతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



నృసింహావతారంలో భక్తులకు దర్శన మిచ్చిన స్వామివారు

14న రోలుగుంటలో గురుపూజ

రోలుగుంట: స్థానిక రామ మందిరం ఆవరణలో ఈ నెల 14న గురుపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎ.గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మన నిత్యకృత్యాల విజయానికి శుభ ఘడియలకు సాధనగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాభివృద్ధికి పాటుపడే వారికి సహకారం

దేవరాపల్లి: గ్రామాభివృద్ధికి పాటుపడే వారికి పార్టీలకతీతంగా తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఉప సర్పంచ్ సిరపరపు గంగాధర్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి తెలిపారు. గురువారం ఎం. అలమండలో మాజీ సర్పంచ్ శీర అచ్చియ్యమ్మ, వార్డు మెంబర్ సూర్యకుమారి, పాల సంఘం-2 అధ్యక్షుడు పాలిపిరెడ్డి రమణలతో కలిసి వారు మాట్లాడారు. పదేళ్లుగా పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త తన సొంత నిధులతో శ్మశాన వాటికను బాగు చేయించడం ఆనందదాయకమన్నారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే అటువంటి వ్యక్తికి తమ తోడ్పాటునందిస్తామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రోలుగుంట: నర్సీపట్నం రూరల్ 11 కేవీ సబ్ స్టేషన్ చెట్టుపల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ విడివి రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా రోలుగుంట మండలంలో వెలంకాయలపాలెం, నిండుగొండ, మునిపల్లి, ఎన్.కొత్తూరు, రాజుపేట, గుర్రంపేట, వడ్డిప, బుచ్చింపేట, రాజన్నపేట, కాముడుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కె.కోటపాడు: మండలంలో కింతాడ 11 కేవీ ఫీడర్ పరిధి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ రావు తెలిపారు. విద్యుత్ లైన్లలో మెయిన్‌టెనెన్స్ పనుల నిర్వహణలో భాగంగా కింతాడ, గొల్లలపాలెం, జోగన్నపాలెం, ఆర్లి, కె.సంతపాలెం, చంద్రయ్యపేట గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

దేవరాపల్లి: బోయిలకింతాడ సబ్ స్టేషన్ పరిధి ఎం. అలమండ 11 కేవీ ఫీడర్ పరిధిలో లైన్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ విడివి రామకృష్ణ తెలిపారు. ములకలాపల్లి, కొత్తపెంట, ఎన్.జి.నగరం, ఎం. అలమండ, ఎ. కొత్తపల్లి, ముషిడిపల్లి, కె.ఎం. పాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెం ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ బాలకృష్ణ తెలిపారు. లైన్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్న దృష్ట్యా కొండలఅగ్రహారం, జి.గంగవరం, సీతన్నఅగ్రహారం, కృష్ణాపురం, చంద్రయ్యపాలెం, శ్రీరాంపురం గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ

దాలివలస పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో పట్నాయక్

కె.కోటపాడు: పాఠశాలల్లో ప్రతి విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. దాలవలస ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. ఇప్పటి వరకూ బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. అనంతరం గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి విధులకు హాజరు కావాలని తెలిపారు. అపిడమిక్ సీజన్ కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించాలన్నారు.



విద్యార్థుల చదువులపై ఆరా తీస్తున్న ఎంపీడీవో పట్నాయక్

జనాభా నియంత్రణలో ప్రజలదే కీలకపాత్ర

- అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి లూసీ కార్డిలియా



ఆర్లిలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న లూసీ కార్డిలియా, డి.ఎస్.ఎన్.రాజు

కె.కోటపాడు: జనాభా నియంత్రణలో ప్రజలదే కీలకపాత్ర అని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి లూసీ కార్డిలియా తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆర్లిలో వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఆనందమయ కుటుంబ రహస్యం-ఇద్దరు పిల్లల మధ్య మూడు సంవత్సరాల కాలం ఎడం అనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో చౌడువాడ పి.హెచ్.సి హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎ.ఎన్.ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక జనాభాపై అవగాహన

మాకవరపాలెం: జనాభా లెక్కల్లో ప్రపంచంలోనే భారతదేశం ప్రథమ స్థానంలో ఉందని హెచ్‌ఎం రాము తెలిపారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 144 కోట్ల మందితో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలిచిందన్నారు.



జనాభాపై విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం రాము



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

అధిక జనాభా వల్ల కలిగే లాభాలు, నష్టాలపై విద్యార్థులకు వివరించారు. ఇక యువకులు అధికంగా ఉన్న దేశంలోనూ భారతదేశం ప్రథమంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల: పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారిస్తే జనాభా పెరుగుదల పెద్ద సమస్య కాదని ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. జనాభా పెరుగుదల, దాని ఆవశ్యకతపై వివరించారు. ఉపన్యాసకులు నాగేశ్వరరావు, అప్పలనాయుడు, షర్మిలశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆపన్నహస్తం

నర్సీపట్నం: స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తం అందించారు. గొలుగొండ డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 1995-96లో విద్యనభ్యసించిన నాతవరం మండలం పి.కె.గూడేనికి చెందిన పూర్వ విద్యార్థి కొమ్ము సూర్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. వీరంతా రూ.50 వేలు సేకరించి గురువారం మృతుని స్వగ్రామంలో అతని కుటుంబానికి అందజేసి ఓదార్చారు. తమ స్నేహితుడిని కోల్పోవటం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు తాటిపూడి గోవింద్, కమిటీ సభ్యులు ఆరుగుల్ల నాగేశ్వరరావు, పెదపూడి అప్పారావు, బోడపాటి సత్యప్రకాష్, అర్జున్, పోట్ల ఆనందరావు, గారా కృష్ణప్రసాద్, సింహాచలం, గోరింట అప్పారావు, దొండా సూర్యనారాయణ, బొండాడ పోలయ్య, దేవులపల్లి మునలయ్య పాల్గొన్నారు.



మృతుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు సిద్ధం

మాడుగుల రూరల్: రైతు సేవా కేంద్రాల వద్ద సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు మాడుగుల పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కిలోల మెక్కజొన్న కిట్ రూ.340 కాగా, సబ్సిడీ రూ.255 పోను రైతు రూ.85 చెల్లించి పొందాలన్నారు. ఐదు కిలోల కాకిజొన్న విత్తనాలు రూ.460 కాగా, సబ్సిడీ రూ.345 పోను మిగిలిన రూ.115 చెల్లించాలని పేర్కొన్నారు. అలసంద విత్తనాలు మూడు కిలోలు రూ.295.50 కాగా, సబ్సిడీ రూ.222 పోను రైతు రూ.74 చెల్లించాలని తెలిపారు.